# అవసరాలు

శ్రీ రామారావు

జోరుగా వర్షం కురుస్తూంది. వేదవతి గుమ్మంలో నించోని దారినిపోయేవార్ని ఆకర్షిస్తూంది. జల్లుకి ఆమె గుమ్మంలో నిలువలేక అద్దాలతలుపులు వేసి రోడ్డువేపుచూస్తోంది. రాత్రికి యెలా అయినా వొకణ్ణి ఆకర్షించి, వశీకరించుకుని, డబ్బు గుంజుకోవాలని. వర్షంలో తడిసిపోతూ పోష్టు బంట్రోతు వేదవతిగుమ్మంలో నిలబడి తలుపుతట్టాడు. ఆమె ఆతృతతో సంతృప్తితో తలుపుతెరచింది: మొన్నరాత్రి డబ్బుయివ్వకండా వెళ్ళిపోయిన జమీందారు మని యార్డర్ చేశాడేమోని చూస్తే మామ్మోలు నత్తి విశ్వనాథంకాదు. "వుత్తరాలు యేమైనా వొచ్చాయా? "వేదవతి అడిగింది.

"కాదు కాని చలేస్తుంది....పొయి దగ్గర జేరాలి, నాకు దారి చూపించు."

దడదడ వణుకుతూ తడసినబట్టల్తో పోష్టుబంట్రోతు వెంకటపతి ఆమెను తొందరచేశాడు. ఆమె తొందరగా వంటయింట ప్రవేశించి అగ్గివేసింది. వెంకటపతి తడిబట్టలు విప్పేసి చిన్నకొల్లాయి గుడ్డ కట్టుకుని చలికాగుతూన్నాడు. అకాశంమీద మెరుపులూ, వురుములూ వర్షాన్ని యింకా రెచ్చగొట్టాయి.

"చాలా రాత్రి అయినట్టుంది. యేమైనా యెంగిలిపడతారా యేం?"

అతనేమి జవాబుచెప్పలేదు. ఆమె పదార్థాలన్నీ తీసుకొచ్చి వెంకటపతి ముందుంచింది. అతను మొగమాటపడుతూ మెల్లిగా పదార్థాలన్నీ పూర్తిచేశాడు. ఆమె వెచ్చని పాలు తీసుకొచ్చి యిచ్చింది. కాస్సేపు సెగతీర్చుకున్నాక "యెప్పుడో చిన్నప్పుడు మా అమ్మవుండగా యింత రుచికల పదార్థాలు తిన్నాను. యీ హోటల్ తిండిమూలాన నానాలికే రుచిపోల్చుకోవడం మర్చిపోయింది. మళ్లా నాకు వెనుకటరోజులు జ్ఞాపకం చేశాయి యీవాళ నీవంటకాలు. నీవెవ్వరు? "ఆమె బుర్రవొంచుకొని ఆకులకు సున్నం రాస్తూ "రోజూ ఆకలికి శరీరాన్ని అమ్ముకునే........" అతనే మంటాడోనని అతనికేసి కన్నులొదిలేసిచూస్తోంది. ఆకలితో, అతను నిర్మలంగా "అట్లానా. అయితే నాకూ యెవ్వరూలేరు. నాభార్య యెప్పుడో చాలాకాలంక్రితమే పోయింది. అప్పటినుంచి నేను వొంటరిగానేవుంటున్నాను .... నాకు వొండిపెడ్తూ....వుండకూడదూ?" నవ్వుతూ ఆమెవేపుచూచాడు. "బాగానేవుంది. మీకు వొండిపెడ్తూంటే నా ఆకలేలాతీరుతుంది? నాయింటికి యింకెవ్వరొస్తార? "మళ్ళీ యింకొకణ్ణి మీయింటి గడప తొక్కనిస్తానా? నీకు అసలు ఆకలివేయనిస్తానా, నాజీతంరాళ్ళు అన్నీతీసుకొచ్చి నీచేతుల్లో పోయనూ" అని ఆమెచేతుల్లో మడుపులు అందుకున్నాడు. "అయితే నన్ను పెళ్ళిచేసుకుంటారా?" "అవును తప్పకండాను. నీ వంగీకరిస్తే అంతకంటే నా కింకీ జీవితంలో యింకేం కావాలి?" ఆమె యాలుకకాయ వొల్చి అతనికి యిస్తోంది. అతను ఆమె చెయ్యి పట్టుకుని పెదవులకి తగిలించి. నాలుకలో యాలుకగింజలు అందుకుని, ముద్దుపెట్టుకున్నాడు. జీవితానికి స్త్రీపురుషుల కలియక అవసరం. స్త్రీకితోడు పురుషుడూ; పురుషుడికితోడు స్త్రీ అవసరం. అందుచాత వొకరి అవసరాలు వొకరికి వుంటూంటాయి తెలిసిందా? చూడు, గతంగురించి నీవేమీ అనుకోకు. నాకూ కొంచం వయసు మళ్ళుతోంది. నలభై దాటాయి. యీస్థితిలో నాకు జాగ్రత్తగా వండిపెట్టి నా ఆరోగ్యాన్ని కాపాడ్డానికి నీవంటి అనుభవంగల స్త్రీ అవసరం. నీవంటి అనుభవనీయురాలు దొరకడం చాలాకష్టం. నీకూ జీవితంలో చాలా అనుభవంవుంది. యిక మన దాంపత్యంలో యెటువంటి వొడుదుడుకులూ రావు. కొత్తలో వొడుదుడుకులవల్ల దంపతుల జీవితంలో చాలామార్పులు జరిగి, తిరిగి వకర్నివకరు అర్థం చేసుకునేసరికి జీవితంలో అమూల్యమైనఘట్టాలు వృథాగా పోతూన్నాయి. అందుచాత యిక మన జీవితంలో మార్పులు సుఖంగా, ఆనందంగా నేటినుండి దంపతులుగానే వ్యవహరిద్దాం. అతనులేచి పంచకట్టుకుంటూ పడకగదివేపు నడకసాగించాడు. వేదవతి పళ్ళెంలో పూలదండతీసి అతనిమెడలోవేసి అద్దంలో చూస్తూ "బాటసారివై వొచ్చి భర్తవైకూచున్నావా?" అని కిలకిల నవ్వింది. ఆకాశంమీద మెరుపుమెరిసింది. వురుమువురిమింది. తలుపు గడపడింది.